క్లుప్తంగా

నష్ట పరిహారం చెల్లించాలి

వీణవంక: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మడుగూరి సమ్మిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో మాట్లాడారు. వడగండ్ల వానకు మొక్కజొన్న, వరి పంటలు దెబ్బతిన్నాయని, అధికారులు కేవలం మొక్కజొన్న పంట సర్వే చేసి ఉన్నతాధికారులకు పంపించారని, రోజులు గడుస్తున్నా ఇంతవరకు రైతుల ఖాతాల్లో నగదు పడలేదని పేర్కొన్నారు. వరి పంట నష్టపోయిందని, మొక్కజొన్నతో పాటు వరికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ రైతుల పట్ల వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరగా పరిహారం అందించాలన్నారు.

సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ ఆదర్శం

వీణవంక: సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తోందని, సీఎం కేసీఆర్ కృషి ఎంతో ఉందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గంగాడి తిరుపతిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం మాట్లాడారు. అభివృద్ధిని ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని ఆరోపించారు. రైతుబంధు, దళితబంధు పథకాలను ఇతర రాష్ట్రాల సీఎంలు అమలు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట పలువురు నాయకులు, తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత


ఆర్థిక సాయం అందజేస్తున్న ఇమ్మడి సతీష్

జమ్మికుంట: జమ్మికుంట పట్టణానికి చెందిన తెలంగాణ యువత నాయకుడు ఇమ్మడి సతీష్ ఆదివారం సింగర్, పాటల రచయిత(అనితా.. ఓ అనితా..) నాగరాజుకు రూ. పదివేల ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబ, పిల్లల అనారోగ్య సమస్యలతో నాగరాజు ఇబ్బందులకు గురవుతున్నాడని, హైదరాబాద్‌లోని ఆయన ఇంటికి వెళ్లి నగదు అందజేశామన్నారు. యువ కళాకారుడని ఆదుకోవాలని కోరారు.

దహన సంస్కారాలకు...

చొప్పదండి: పట్టణంలోని ఇందిరానగర్ ఐదో వార్డుకు చెందిన కల్లెపల్లి సుశీల అనారోగ్యంతో మృతి చెందారు. ఆర్థికసాయం కోసం ఆదివారం రామక్రిష్ణ సేవా సమితిని సంప్రదించగా నిజానపురం శంకరయ్య దహన సంస్కారాలకు రూ.5 వేలు అందించారు. చెట్ల రాంకిషన్, నిజానపురం చందు, తదితరులున్నారు.

నూతన కార్యవర్గం

కరీంనగర్: శాతవాహన లయన్స్ క్లబ్ 2023–24 నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి కోమల్ల రాజేందర్‌రెడ్డి సమక్షంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా యాదగిరి శేఖర్‌రావు, కార్యదర్శిగా మర్రిపల్లి మహేందర్, కోశాధికారిగా కోట సత్యం ఎన్నికయ్యారు. ఇనుగుర్తి రమేశ్, వి.జగదీశ్వరాచారి, కెప్టెన్ బుర్ర మధుసూదన్ రెడ్డి, ఎస్.ప్రసాదరావు, బి.నర్సింగరావు, ఎం.సత్యనారాయణరావు, రాజేందర్‌రెడ్డి, జేసీ ప్రకాశ్, వి.నరేందర్‌రెడ్డి, మేకల అరవింద్, సీహెచ్.రామ్మోహన్‌రావులు బోర్డు ఆఫ్ డైరెక్టర్స్‌గా నియమించబడ్డారు. నూతన కార్యవర్గాన్ని సభ్యులు అభినందించారు. క్లబ్ సేవా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి పేదలకు చేయూతనిస్తామని నూతన కార్యవర్గ సభ్యులు హామీ ఇచ్చారు.

కొనసాగుతున్న ఎల్లమ్మ తల్లి బోనాల జోగు

కరీంనగర్‌కల్చరల్: గౌడ కులస్తుల అధ్వర్యంలో కరీంనగర్ రేణుకదేవి ఎల్లమ్మ తల్లి బోనాల జాతరలో భాగంగా జోగు కార్యక్రమం నగరంలో కొనసాగుతోంది. ఆదివారం మంకమ్మతోటలోని 36వ డివిజన్ కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ శ్రీనివాస్ నివాసంలో జోగు కార్యక్రమం చేపట్టారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చి ఒడిబియ్యం పోసి పూజలు చేశారు. ఈనెల 25న బోనాల జాతరకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. యాగండ్ల రవికుమార్‌గౌడ్, నాగుల కిరణ్‌గౌడ్, పొన్నం మధుగౌడ్, శ్యాంగౌడ్, తిరుపతిగౌడ్, రమేశ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా గుండ్లపల్లి

- నాటి రంగనాయకపల్లె నేటి గుండ్లపల్లి
- గుండ్లపల్లి స్టేజీ వ్యాపారాలకు మూల కేంద్రం


గుండ్లపల్లి స్టేజీ


గుండ్లపల్లి గ్రామ పంచాయతీ

గన్నేరువరం: ఆ గ్రామంలో రంగనాయకుల దేవాలయం ఉండటంతో ఊరికి రంగనాయకులపల్లెగా పేరు వచ్చింది. కాగా గ్రామంలో గుండ్లు అధికంగా ఉండడంతో బావులు తవ్వడానికి వీలుండేది కాదు. తాగునీటికి ఉన్న చేదబావి(గిరకల బావి) ఒక్కటే గ్రామస్తులందరికి దిక్కు. బావి వద్దకు వెళ్లానికి ఇబ్బంది పడుతుండగా 1979లో ప్రభుత్వ అధికారులు ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఇచ్చినట్లు గ్రామస్తులు కథనం. గుండ్లు అధికంగా ఉండడంతోనే రంగనాయకపల్లె గుండ్లపల్లిగా మారింది. ప్రభుత్వ వివిధ రికార్డుల్లో నేటికి రంగనాయకపల్లెగా ఉంటుందని, అంతేకాకుండా గ్రామ శివారులోని గుండ్లపల్లి స్టేజీ వివిధ వ్యాపారాలకు ప్రధాన కూడలి, ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు వ్యాపారాల నిమిత్తం ఇక్కడికే వస్తుంటారని అంటుంటారు.

90 శాతం మంది వలసదారులు

కరీంనగర్ – హైదరాబాద్‌కు ప్రధాన రహదారి గుండ్లపల్లి స్టేజీకి కలిసొచ్చింది. 1977 వరకు స్టేజీ వద్ద ఒకే ఇల్లు ఉండేది. చీకటి పడిందా ఈ ప్రాంతంలో దొంగల భయం అధికంగా ఉండేది. రాత్రిళ్లు ప్రాంతం గుండా ప్రయాణం అంటే ప్రజలు భయపడేవారు. 1978లో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి టింబర్ డిపో ఏర్పాటు చేశారు. అనంతరం ఒక్కొక్కరు ప్రాంతానికి వచ్చి నివాసం గృహాలు ఏర్పాటు చేసుకున్నారు. మండలానికి చెందిన 15 గ్రామ పంచాయతీల ప్రజలు జిల్లా కేంద్రానికి వెళ్లడానికి గుండ్లపల్లి స్టేజీకి రావాల్సిందే. మరోవైపు తిమ్మాపూర్, బెజ్జంకి, కోహెడ మండలాల్లో వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు స్టేజీ వద్ద వివిధ వ్యాపారాలు, వాణిజ్య దుకాణాలు ప్రారంభించారు. వ్యాపారం నిమిత్తం వచ్చినవారు భూములు కొనుగోలు చేసి గృహాలను నిర్మించుకొని స్థిరపడిపోయారు. ఇక్కడి జనాభాలో 90 శాతం మంది వలసదారులే.

లక్షల్లో వ్యాపారం

గుండ్లపల్లి స్టేజీలో ఎస్‌బీఐ, తెలంగాణ దక్కన్ గ్రామీణ బ్యాంకు, ప్రైవేట్ ఆసుపత్రి ఉంది. రెండు ప్రైవేట్ స్కూళ్లు, ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలలు, పెట్రోల్‌బంకులు, దాబాలు, హోటళ్లు ఉన్నాయి. వీటిని వివిధ గ్రామాలకు చెందిన వారే నిర్వహిస్తారు. మెడికల్ షాపులు, డీసీఎంఎస్, ఫెర్టిలైజర్స్ షాపులు, వస్త్ర, జనరల్ దుకాణాలు, సిమెంట్ షాపులు, సెల్ పాయింట్లు, జిరాక్స్, బేకరీలు, మనీ ట్రాన్స్‌ఫర్, మద్యం, వివిధ షాపుల ద్వారా రోజుకు రూ.10 లక్షల వ్యాపారం సాగుతుందని, రియల్ ఎస్టేట్ వ్యాపారం భారీస్థాయిలో జరుగుతుందని సమాచారం.

దొంగల భయం ఉండేది



దాదాపు ఇరవై ఏళ్ల క్రితం రూ. 6,500 రెండు గుంటలు భూమి కొనుగోలు చేసి ఇల్లు నిర్మించుకున్నాం. గుండ్లపల్లి స్టేజీ వద్ద ఒకప్పుడు ఇళ్లు తక్కువ ఉండేవి. దొంగల భయం ఉండేది. ఇంటి నిర్మాణం తర్వాత నుంచి మెడికల్ నిర్వహిస్తున్నాను.

– రాజేశం, రాంహనుమాన్‌నగర్, తిమ్మాపూర్ మండలం

వ్యాపారాలకు కేంద్రం



మా నాన్న మల్లయ్య 1992లో ఇల్లు నిర్మించారు. అప్పటి నుంచి ఇదే ఇంటిలో బెజ్జంకి మండలానికి చెందిన గంప శ్రీనివాస్ కిరాణం షాపు నిర్వహిస్తున్నాడు. ఇక్కడే వ్యాపార్థుడిగా స్థిరపడ్డాడు. మండలంలో గుండ్లపల్లి వ్యాపార కేంద్రంగా ఏర్పడింది.

– గూడెల్లి అంజనేయులు, ఎంపీటీసీ, గునుకులకొండాపూర్

మండలం చేయాలి



గుండ్లపల్లి స్టేజీ వద్ద వ్యాపారం నిర్వహించేవారు దాదాపు ఇతర గ్రామాల నుంచి వచ్చినవారే. ఒక్కొక్కరు వివిధ దుకాణాలను నిర్వహిస్తూ స్థిరపడ్డారు. మంచి వ్యాపారం కేంద్రం గుర్తింపు వచ్చింది. మండలంగా గుర్తిస్తే మరింత అభివృద్ధి చెందుతోంది.

– బేతెల్లి సమత, సర్పంచ్ గుండ్లపల్లి

హరితహారం పేరిట చెరువుశిఖం ఆక్రమణ

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్ గోపాల్ చెరువు శిఖం స్థలాన్ని ఓ సంస్థ ప్రతినిధులు హరితహారం పేరిట ఆక్రమించుకోవడం వివాదాస్పదంగా మారింది. ఆదివారం భూమి చదును చేయడంతో స్థానికులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో ఆర్‌ఐ విచారణ చేపట్టారు. హౌసింగ్‌బోర్డుకాలనీ, కృష్ణానగర్ కాలనీ సమీపంలోని సర్వే నం.728లో 28.10 ఎకరాల విస్తీర్ణంలో గోపాల్‌చెరువు శిఖం స్థలం ఉంది. స్థలాల ధరలు విపరీతంగా పెరగడంతో పాటు నగరానికి చేరువలో ఉండటంతో శిఖం స్థలాన్ని స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలతో పలువురు ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నారు. ఈక్రమంలోనే ఆదివారం ఐఎంఏ పేరుతో కొందరు చెరువు శిఖం స్థలాన్ని చదును చేసి మట్టి పోసే కార్యక్రమాన్ని చేపట్టారు. కోట్లాది రూపాయల విలువైన శిఖం స్థలం ఆక్రమించుకుంటున్నారని బీఆర్ఎస్ నాయకుడు ర్యాకం మోహన్ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా ఆర్‌ఐ రజనీకాంత్ మోఖాపై విచారణ చేపట్టారు. మూడేళ్లక్రితం అప్పటి కలెక్టర్ హరితహారంలో మొక్కలు పెంచేందుకు ఐఎంఏకు మూడు ఎకరాల స్థలాన్ని కేటాయించారని సంస్థ ప్రతినిధులు తెలిపారు. మొక్కలు నాటేందుకు వీలుగా స్థలాన్ని చదును చేసి చుట్టూ ఫెన్సింగ్ నిర్మాణం చేస్తున్నట్లు వివరించారు. కేటాయించిన స్థలంలో మొక్కల పెంపకం మాత్రమే చేపట్టాలని, ఇతర కట్టడాలు నిర్మిస్తే కూల్చివేస్తామని తహసీల్దార్ డాక్టర్ కె.నారాయణ తెలిపారు. గతంలోనే ఐఎంఏ ప్రతినిధులు స్థలాన్ని చదును చేసేందుకు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. ప్రస్తుతం మళ్లీ హరితహారం పేరుతో శిఖం స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మోహన్ ఆరోపించారు. తక్షణమే ఐఎంఏకు కేటాయించిన స్థలాన్ని రద్దు చేసేందుకు కలెక్టర్ కర్ణన్ తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

ప్రపంచ మేధావి బీఆర్ అంబేడ్కర్

ఎమ్మెల్యే సుంకె రవిశంకర్


గంగాధర: విగ్రహావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే

గంగాధర: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మేధావి అని, ఆయన రాసిన రాజ్యాంగం ద్వారానే ప్రత్యేక తెలంగాణ ఏర్పాటైందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని కోట్లనర్సింహులపల్లి గ్రామంలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర సచివాలయానికి అంబేడ్కర్ పేరుపెట్టడం, హైదరాబాలో 125 అడుగుల విగ్రహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. యువత సన్మార్గంలో నడిచి ఉన్నత స్థాయిలో రాణించాలని సూచించారు.

ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రం ప్రారంభం

రామడుగు: మండల కేంద్రంలోని విన్నర్స్ పాఠశాలలో రైజింగ్‌సన్ యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ఆదివారం చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళలు టైలరింగ్ నేర్చుకొని స్వయం ఉపాధి ద్వారా ఆదాయం పొందాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమం ఏర్పాటు చేసిన యూత్ క్లబ్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పంజాల ప్రమీల, మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి తిరుపతి, వైస్ చైర్మన్ చాడ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా యువజన అవార్డు గ్రహీత గజ్జెల అశోక్, మాజీ సర్పంచ్ పంజాల జగన్‌మోహన్‌గౌడ్, నాయకులు అనిల్, ఎండీ మోహిజ్, బుత్కూరి సురేష్, మాస్టర్ ట్రైనర్ మాధవిగౌడ్ పలువురు పాల్గొన్నారు.

ప్రజలను తప్పుదోవ పట్టించొద్దు


మాట్లాడుతున్న ఎంపీపీ రాణి

హుజూరాబాద్: ముస్లిం మహిళను వేధించిన సర్పంచ్‌కు ఎమ్మెల్యే ఈటల రాజేందర్ వత్తాసు పలకడం సరికాదని ఎంపీపీ ఇరుమల్ల రాణిసురేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి నివాసంలో మాట్లాడారు. ఎమ్మెల్యే ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. చెల్పూర్‌కు చెందిన మహిళ గ్రామంలో చికెన్ సెంటర్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తుంటే సర్పంచ్ సెంటర్ తొలగించాలని వేధింపులకు గురిచేయగా పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిందని, ఆమె కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడని పేర్కొన్నారు. చట్టపరంగా కేసు నమోదు చేసిన సీఐపై ఎమ్మెల్యే విమర్శలు చేయడం సబబుకాదన్నారు. ఈటలను నియోజకవర్గంలో ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. సర్పంచ్‌కు మద్దతుగా ధర్నా చేస్తున్న ఈటల ప్రజలకు ఏం మెసేజ్ ఇస్తున్నారని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డికి వస్తున్న ఆదరణ ఓర్వలేక ఈటల మతితప్పి మాట్లాడుతున్నారని, మహిళకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామని స్పష్టం చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, కౌన్సిలర్లు ఉజ్మానూరిన్, కల్లెపల్లి రమాదేవి, మారపల్లి సుశీల, నాయకులు పావని, తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలు తగదు

ఫిర్యాదులు వస్తే చట్ట ప్రకారం నడుచుకుంటామని హుజూరాబాద్ టౌన్ సీఐ బొల్లం రమేశ్ అన్నారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో మాట్లాడారు... ఈ నెల 12న చెల్పూర్ గ్రామానికి చెందిన షాబుద్దీన్ తన తల్లి ఆత్మహత్యయత్నానికి పాల్పడిందని, సర్పంచ్, వార్డ్ మెంబర్ కారణం అంటూ ఫిర్యాదు చేశాడని తెలిపారు. ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి సర్పంచ్, వార్డు మెంబర్‌ను అరెస్ట్ చేసి వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరుపరిచామని, కొంతమంది నాయకులు, ప్రజాప్రతినిధులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. పోలీసులపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని, తప్పుడు ఆరోపణలు చేస్తే వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోతుందని, నిజాలు తెలుసుకొని మాట్లాడాలని కోరారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ


బియ్యం అందిస్తున్న పొన్నం అనిల్ గౌడ్

తిమ్మాపూర్: మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన దేవునూరి లింగయ్య, రామంచ అశ్విని కుటుంబాలను ఉపసర్పంచ్ పొన్నం అనిల్‌గౌడ్ ఆదివారం పరామర్శించారు. మృతికి గల కారణాలు తెలుసుకొని కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అనంతరం ఒక్కో కుటుంబానికి యాభై కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కిష్టయ్య, గంగాధర్, జగదీష్,కొమురయ్య, స్వామి, తిరుపతి, సంపత్, వేణు కుమార్, సదయ్యగౌడ్, చంద్రమౌళి, నిఅంజయ్య, శ్యామ్, శ్రీనివాస్, శ్రీకాంత్, నరేందర్ పాల్గొన్నారు.

బీఎస్పీ గ్రామ కమిటీలు


చిన్నముల్కనూరులో బీఎస్పీ నూతన కమిటీ, మండల నాయకులు

చిగురుమామిడి: బీఎస్పీ చిన్నముల్కనూర్ గ్రామశాఖ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పందిపిల్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా ఇ.మహేష్, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్, కార్యదర్శిగా కార్తీక్, కోశాధికారిగా అక్షయ్ కుమార్, సోషల్ మీడియా ఇన్చార్జిగా రమేశ్ ఎన్నికయ్యారని బీఎస్పీ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ భిక్షపతి తెలిపారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు సతీష్, ప్రధాన కార్యదర్శి నాగరాజు, కార్యదర్శి వెంకటేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండలంలోని మల్యాల బీఎస్పీ గ్రామ అధ్యక్షుడిగా చందగాళ్ల కిషోర్, ఉపాధ్యక్షుడిగా మేకల రాజేష్, ప్రధాన కార్యదర్శిగా కుమారస్వామిని బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి మేకల రవీందర్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. కార్యదర్శులుగా ఓదెలు, రవితేజ, అశోక్, అజయ్, కుమారస్వామి, హరీశ్, ఐలయ్య, రాజేందర్, సునీల్, తిరుపతి, ప్రవీణ్ ఎన్నికయ్యారు.


గ్రామ కమిటీ నూతన కార్యవర్గసభ్యులు

పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి


మాట్లాడుతున్న నాగరాజు

కరీంనగర్‌కల్చరల్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని కోతిరాంపూర్‌లో గల ముకుందలాల్ మిశ్రా భవన్‌లో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రజనీకాంత్ మాట్లాడుతూ జిల్లాలోని పలు సంక్షేమ హాస్టళకు సొంత భవనాలు లేక అరకొర వసతులతో అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఫెడరేషన్ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ పూజ, జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు అరవింద్, రోహిత్, అభిలాష్, సహాయ కార్యదర్శి వినీషా, వినయ్, మనోజ్ పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్


ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, సర్పంచ్ రమేశ్, ముస్లింలు

తిమ్మాపూర్: మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తారని మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని నుస్తులాపూర్ లో సర్పంచ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేశ్ ఆధ్వర్యంలో ఆదివారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముస్లిం లతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. రంజాన్ ముస్లింలకు పవిత్ర మాసమని, నెల రోజుల ఉపవాస దీక్ష సహనం, ఆకలి బాధను తెలియజేస్తాయన్నారు. పండుగను ఐక్యంగా జరుపుకోవాలన్నారు. అనంతరం మసీద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ షాకత్ అలీకి రుమాల్ టోపీ, ఖజూర్ అందించారు. అనంతరం ముస్లింలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ కొత్త తిరుపతిరెడ్డి ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఎంపీపీ వీరారెడ్డి, అబ్దుల్ సత్తార్, సయ్యద్ హుస్సేన్, బాబు పటేల్ జానీ, ఆజు, నిసార్, ఖాసిం, నేహాల్, సోహెల్, తాజుద్దీన్, అజ్జుం, సజ్జు తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్: రంజాన్ సందర్భంగా ఆదివారం ముస్లింలకు మానకొండూరు సర్పంచ్ రొడ్డ పృథ్వీరాజ్ ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి సుడా చైర్మన్ జీవీ రామకష్ణారావు హాజరై మాట్లాడారు. రంజాన్ ముస్లింలకు పవిత్ర మాసమని పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరారు.

ఓటుహక్కుపై విద్యార్థుల అవగాహన


ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

జమ్మికుంట: మండలంలోని వెంకటేశ్వరపల్లి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం అనుబంధ వరంగల్ వ్యవసాయ కళాశాల బీఎస్సీ విద్యార్థుల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం కొనసాగుతోంది. ఈసందర్భంగా ఆదివారం విద్యార్థులు ఓటుహక్కుపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలోని రహదారులు, ఇంటి పరిసరాల్లో వయ్యారిబామా మొక్కలు తొలింగించి మొక్కల వల్ల జరిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు, అసిస్టెంట్ ప్రొఫెసర్ అనుష, కేవీకే శాస్త్రవేత్త మహేశ్, సర్పంచ్ రాజుకుమార్, వార్డు సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంగులను పరామర్శించిన వినోద్‌కుమార్

కరీంనగర్: ఎడమ కాలికి గాయమై కరీంనగర్‌లోని తన నివాసంలో చికిత్స పొందుతున్న రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ ఆదివారం పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వినోద్ కుమార్ వెంట మేయర్ సునీల్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామక్రిష్ణారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్, పార్టీ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, నాయకులు తదితరులు ఉన్నారు.


రామడుగు: ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు


జమ్మికుంట: వావిలాలలో...

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

రామడుగు/జమ్మికుంట: రామడుగు మండలం గోపాల్‌రావుపేట ప్రగతి విద్యానికేతన్ పాఠశాల 1997–98, జమ్మికుంట మండలం వావిలాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1985–86 పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆయా పాఠశాలల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో చాలా ఏళ్ల తర్వాత ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. వారికి మెమొంటో జ్ఞాపికలు అందజేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. అనంతరం మృతిచెందిన పలువురికి నివాళి అర్పించారు.